# ప్రజా తీర్పును శిరసావహిస్తాం

- లోటుపాట్లపై సమీక్షించుకుంటాం..
- కాంగ్రెస్ హామీలను నెరవేర్చాలి
- ఇప్పటి వరకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి, డిసెంబర్ 4 : ప్రజల తీర్పును శిరసావహిస్తామని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ అన్నారు. తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసన సభ ఎన్నికల్లో కామారెడ్డి నుంచి కేసీఆర్ ఓడిపోయారని.. ప్రజల తీర్పును శిరసావహిస్తామని అన్నారు. పార్టీలో ఎక్కడెక్కడ లోటుపాట్లు ఉన్నాయో తప్పకుండా సమీక్షించుకుంటామని అన్నారు. భవిష్యత్తులో బలమైన ప్రతిపక్షంగా కామారెడ్డిలో బీఆర్ఎస్ నిలబడుతుందని అన్నారు. 2009 లో తెలుగు దేశం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి సుమారు 15 సంవ్సరాలుగా కామారెడ్డి శాసనసభ సభ్యుడిగా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉన్నానని.. కామారెడ్డికి సీఎం కేసీఆర్ సహకారంతో పుష్కలంగా నిధులు మంజూరు చేయించి అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని అన్నారు. 2011 ఉద్యమ సమయంలో ప్రజల అభీష్టం మేరకు టీడీపీకి రాజీనామా చేసి అప్పటి టీఆర్ఎస్ పార్టీలో చేరానని తెలిపారు.అప్పటి నుంచి ప్రజలకు సేవ చేశానని అన్నారు. తనను గెలిపించిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలతో ప్రభుత్వంలోకి వచ్చిందని.. తప్పకుండా అభినందిస్తూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని అన్నారు. ప్రజలకు చెప్పి గెలిచారు కాబట్టి అవి అమలు చేయాలని అన్నారు. కామారెడ్డిలో బీజేపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రజలకు రూ.150 కోట్ల విలువ గల మ్యానిఫెస్టోను విడుదల చేశారు అని అన్నారు. అందులో సూపర్ స్పెషలిటీ దవాఖాన, మండల కేంద్రంలో జనరల్ దవాఖాన, రైతులకు కల్లాలు, పాఠశాలలను అవసరమైతే తన ఆస్తులను అమ్మి అభివృద్ధి చేస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చారని వాటిని అమలు పరచాలని అన్నారు. దేశంలో ఏ నాయకుడు చేయని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారని.. ఇచ్చిన హామీని తూచా తప్పకుండా నెరవేర్చి నిజాయితీని చాటుకొని ప్రజల మన్ననలను పొందాలని అన్నారు.బీఆర్ఎస్ బలమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని అన్నారు. చిన్న చిన్న పొరపాట్లపై సమీక్షించుకొని కామారెడ్డిలో బీఆర్ఎస్‌ను ఎలా నిలబెట్టుకోవాలో సమీక్షించుకుంటామని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు వ్యతిరేకంగా ఏదైనా కార్యక్రమాలు చేస్తే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిలదీస్తామన్నారు. మంచి చేస్తే స్వాగతిస్తామని అన్నారు. తనను 15 సంవత్సరాలుగా గెలిపించిన ప్రజలకు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



బాల్కొండ, బాన్సువాడ ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి, పోచారం శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవెల్లిలో సోమవారం కలిశారు. హ్యాట్రిక్ విజయం సాధించిన వేముల, స్పీకర్‌గా పని చేసి సైతం చరిత్ర తిరగరాసి మళ్లీ గెలుపొందిన పోచారం.. కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

–కమ్మర్‌పల్లి, డిసెంబర్ 4

## నియోజకవర్గ ప్రజలకే నా జీవితం అంకితం

**ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి**



ఆర్మూర్ టౌన్, డిసెంబర్ 4 : ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకే తన జీవితం అంకితమని మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రెండుసార్లు అవకాశం ఇచ్చిన ఆర్మూర్ ప్రజానీకానికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. పదేండ్ల పాలనలో ప్రజలకు అవసరమైన అన్ని అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయనిర్ణేతలని.. వారి తీర్పును శిరసావహిస్తానని తెలిపారు.

## పాఠకులే కవిత్వానికి కోట



అమృతలతను సన్మానిస్తున్న హరిదా రచయితల సంఘం ప్రతినిధులు

- ప్రముఖ కవయిత్రి డాక్టర్ అమృతలత
- ఘనంగా హరిదా సరస్వతీరాజ్ రాష్ట్రస్థాయి కవిసమ్మేళనం

ఖలీల్‌వాడి, డిసెంబర్ 4 : పాఠకులే కవిత్వానికి కోట లాంటివారని, వారిని మెప్పించే కవిత్వం రాయడం నిబద్ధతతోనే సాధ్యమని ప్రముఖ రచయిత్రి, విద్యావేత్త డాక్టర్ అమృతలత అన్నారు. నిజామాబాద్ శివారులోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో సోమవారం సరస్వతీరాజ్–హరిదా పురస్కార సభ, రాష్ట్రస్థాయి కవి సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కవిత్వంలో భాష, ప్రణయ, అభ్యుదయ, విప్లవ కవిత్వాలు వేటికవే సమాజాన్ని చైతన్య దిశలో నడిపాయన్నారు. హరిదా రచయితల సంఘం రాష్ట్రస్థాయి కార్యక్రమాలను నిర్వహిచడంలో తనదైన ముద్ర వేసిందన్నారు. గౌరవఅతిథిగా హాజరైన తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి.శంకర్ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్య మూలాలను తెలుసుకోవాలంటే జిల్లా వైపు చూడాలని పరిశోధకుల అభిప్రాయమని తెలిపారు. గొప్ప నాగరికత, చరిత్ర, సాహిత్యం ఇక్కడి ప్రజల జీవితంలో భాగమైందని వివరించారు. మనిషిని మనిషిలాగా జీవించేటట్లు దారి చూపేది కవిత్వమని అభివర్ణించారు. సభకు అధ్యక్షత వహించిన హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ.. కవులు, కవయిత్రులు అనధికార శాసనకర్తలని, వారు నిజాయితీగా వ్యవహరించి సమాజానికి మేలు చేసి రుణం తీర్చుకోవాలని కోరారు. పురస్కారాల ప్రదాత, నవ్యభారతి విద్యాసంస్థల చైర్మన్ క్యాతం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే వారిని మంచి పాఠకులుగా తీర్చిదిద్దాలని, ఆ బాధ్యత తల్లిదండ్రులు, గురువులు స్వీకరించాలని కోరారు. హరిదా రచయితల సంఘం అందిస్తున్న సరస్వతీ రాజ్ – హరిదా ప్రతిభా మూర్తి పురస్కారం డాక్టర్ అమృతలతకు అందించి సన్మానించారు. వివిధ ప్రాంతాల నుంచి హాజరైన 52 మంది కవులు, కవయిత్రులు కవితా గానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, దారం గంగాధర్, అనిల్ బత్తుల, కాసర్ల నరేశ్‌రావు, తిరుమల శ్రీనివాస్ ఆర్య, కంకణాల రాజేశ్వర్, సూరారం శంకర్, మద్దుకూరి సాయిబాబు, సిరిగాద శంకర్, ఎం. కవిత, డాక్టర్ చీదెళ్ల సీతాలక్ష్మి, మూర్తి, తాడూరి ప్రవీణ్, కళ్లెం నవీన్‌రెడ్డి, వసంత లక్ష్మణ్, రేణుక, తల్లావఝుల మహేశ్‌బాబు, డాక్టర్ వెంకన్నగారి జ్యోతి, ఎంఏ.రషీద్ పాల్గొన్నారు. కవితా పఠనం చేసిన సాహితీమూర్తులను ఘనంగా సన్మానించారు.



ఆలయ ఆవరణలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

## నయనానందకరం..

- లక్ష దీపార్చన కార్యక్రమం
- కొనసాగుతున్న కాలభైవరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు
- భారీగా తరలివస్తున్న భక్తులు

రామారెడ్డి, డిసెంబర్ 4 : రామారెడ్డి మండలం ఇసన్నపల్లి(రామారెడ్డి) లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయ బ్రహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. సాయంత్రం భక్తులు లక్ష దీపార్చన కార్యక్రమా న్ని నిర్వహించారు. ఆలయం ముందు అ ఖండ దీపాన్ని ఆలయ ఈవో ప్రభురాం చంద్రం.. పూజరుల వేద మంత్రోచ్ఛారణల మధ్య వెలిగించారు అనంతరం భక్తులు ఆలయం ప్రాగణంలో దీపాలను వెలిగించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, సింగరాయపల్లి గ్రామానికి చెందిన ఒగ్గు కళాబృందం వారిచే ఒగ్గు కథా కాలక్షేపం అలరించాయి. పూజారులు శ్రీనివాస్‌శర్మ, సీనియ ర్ అసిస్టెంట్ సురేందర్, వంశీ శర్మ, నాగరాజు, భరత్, యాదగిరి, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు